# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోంశాఖ రేపు నిర్వహించే సమావేశంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిల్లీకి వెళ్లనున్నారు.**

2. **రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న అమరావతి డ్రోన్ సమ్మిట్ 2024 లోగో, వెబ్సైట్ ను అధికారులు ఈరోజు ఆవిష్కరించారు**

3. **రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

4. **విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి సూచించారు**

5. **తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు సాయంత్రం ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు విహరించనున్నారు.**

==========================

నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోంశాఖ రేపు నిర్వహించే సమావేశంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిల్లీకి వెళ్లనున్నారు. తెలంగాణ, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

--------------------------

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న అమరావతి డ్రోన్ సమ్మిట్ 2024 సన్నాహక కార్యక్రమాలలో భాగంగా విజయవాడలో లోగో, వెబ్సైట్ ను అధికారులు ఈ రోజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంపై మరిన్ని వివరాలను మా ఏన్టీఆర్ జిల్లా ప్రతినిధి మరింత సమాచారాన్ని అందిస్తారు.

(వాయిస్ 27 సెకన్స్)

--------------------------

రాష్ట్రంలో ప్రత్యేకంగా ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడోర్ వి.మధుసూదనరెడ్డి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని గైట్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరాన్ని నిన్న ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి, కడప కేంద్రాల్లో ఇప్పటికే ఎన్‌సీసీ అకాడమీ ఉందని.. విద్యార్థుల

వసతి భవనాల నిర్మాణం చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్‌సీసీ అకాడమీ స్థాపనకు కావలసిన అనువైన స్థలాలను పరిశీలించామని, విశాఖపట్నం లో పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని జరుగుతుందని వెల్లడించారు.

---------------------------

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 2029 నాటికి అమెరికాలోని న్యూయార్క్ నగరానికి విమాన సర్వీసు నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు విమానాశ్రయం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి తెలిపారు. నిన్న నిర్వహించిన సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతికి ప్రముఖుల తాకిడి రోజురోజుకు మరింత పెరుగుతున్నందున వీలైనంత త్వరగా నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. విమానాశ్రయ విస్తరణలో భాగంగా స్థలాలు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చిన హామీలను సత్వరమే నెరవేర్చాలని సలహా కమిటీ నిర్ణయించింది.

---------------------------

వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల విద్యార్థులకు డూప్లి కేట్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు ఈ నెల 12వ తేదీ వరకూ ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు తెలిపారు. ఎస్ఎస్సీ, ఒకేషనల్, డీఎడ్, టీటీసీ, టీసీసీ తదితర సర్టి ఫికెట్లు తడిసి పాడైన వారికి సర్టిఫికెట్ల నకళ్లను ఉచితంగా ఇస్తామన్నారు. అభ్యర్థులు డూప్లికేట్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ చిరునామాతో సొంత డిక్లరేషన్, ఆధార్ కార్డ్ కాపీ తదితర పత్రాలను నిర్ధేశిత నమూనాలో పూర్తి చేసి హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు సమర్పించాలని కోరారు.

---------------------------

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈరోజు ఉదయం పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులను కేటయించిందని తెలిపారు. ఎన్డీఏ వందరోజుల పాలనపై దేశ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొంటూ..

(వాయిస్ 34 సెకన్స్)

---------------------------

కడప నగరంలోని “అమీన్ పీర్ దర్గా” ఉరుసు ఉత్సవాలనువిజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ పిలుపునిచ్చారు. నవంబరు 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉరుసు ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రాలను దర్గా ఆవరణలోని ముషాయిరా మందిరంలో నిన్న ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలలో భాగంగా 16న గంధం, 17న ఉరుసు, 18న ముషాయిరా కార్యక్రమాలుంటాయని వివరించారు. దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం శ్రీ మలయప్పస్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని

వాహనసేవలో దర్శించుకున్నారు. కాగా ఈరోజు సాయంత్రం ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు తిరు మాడ వీధులలో విహరించనున్నారు.

---------------------------

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన ఈ రోజు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. మణిద్వీప క్షేత్రంలో కొలువై ఉన్న అమ్మవారి శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారం ఆమె అత్యున్నత శక్తి, సౌందర్యాన్ని సూచిస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. కాగా దసరా మహోత్సవాలలో భాగంగా శ్రీశైల రాత్రి భ్రమరాంబికాదేవి అమ్మవారు చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

---------------------------

ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవ చాటింపు కార్యక్రమం ఈరోజు సాయంత్రం చదురుగుడి వద్ద నిర్వహిస్తున్నట్లు దేవస్థానం సహాయ కమిషనర్ డి.వి.వి.ప్రసాదరావు తెలిపారు. అమ్మవారి గర్భగుడిలో, ఆలయ ప్రధాన మెట్లపై చాటింపు అనంతరం పైడిమాంబ పుట్టినిల్లు కోటలో చాటింపు ఉంటుందని ఆయన వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 36 సెకన్లు...

---------------------------

రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌లో రేపటి నుంచి 11వ తేదీ వరకు జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా తొమ్మిదో తేదీన ఏక్ పేడ్ మా కె నామ్ తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 11వ తేదీన పొదుపు పథకాలు, తపాలా జీవిత బీమా పాలసీలు, సేవలపై అవగాహన కల్పించి, కొత్త ఖాతాలు ప్రారంభింస్తామని కార్యక్రమం చేస్తామని ఈ తపాలా సేవలను ప్రజలందరు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

=====================